# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 109 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 29 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




తెలంగాణ గవర్నర్‌గా

## జిష్ణుదేవ్‌వర్మ

### తొమ్మిది రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

న్యూఢిల్లీ, జులై 28 (ప్రభాత ఉదయం): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తొమ్మిది రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు శనివారం తెలిపాయి. హరిబౌ కిషన్ రావు బాగ్డే రాజస్థాన్‌గా గవర్నర్‌గా, జిష్ణు దేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా, ఓమ్ ప్రకాశ్ మాథూర్ సిక్కిం గవర్నర్‌గా, సంతోష్ కుమార్ గంగ్వార్ జారండ్ గవర్నర్‌గా, రామెన్ దేకా ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా, సీహెచ్ విజయ్ శంకర్ మేఘాలయా గవర్నగా ..మిగతా 2లో

# కల్వకుర్తికి సీఎం వరాలు


## తాను చదువుకున్న స్కూల్‌కు సైతం రూ.5 కోట్లు ప్రకటన

### రైతులకు అలర్ట్.. ఆగస్టు 14 తర్వాతే 2 లక్షల రుణమాఫీ: సీఎం రేవంత్ రెడ్డి

- రైతుల పట్ల చిత్తశుద్ధిని చాటుకుంటాం
- అధికారం పోయిన బాధ తండ్రీకొడుకులకు ఇంకా తగ్గలే
- కేసీఆర్, కేటీఆర్ మధ్యే సమన్వయం లేదు
- 2014లో జైపాల్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా
- ప్రకటించి ఉంటే కాంగ్రెస్ గెలిచేది
- పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ బిల్లును పాస్ చేయించడంలో ఆయనదే కీలకపాత్ర
- అప్పటి స్పీకర్ మీరాకుమార్‌ను ఒప్పించారు
- రూ.10 కోట్లతో కల్వకుర్తికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- హైదరాబాద్-కల్వకుర్తి మధ్య 4 వరుసల రహదారి
- కల్వకుర్తిలో జైపాల్ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్



నాగర్‌కర్నూల్, జూలై 28, (ప్రభాత ఉదయం): రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ నెలాఖరు (ఎల్లుండి)లోగా రైతులకు రూ.1.50 లక్షల రుణాలను మాఫీ చేసి, తమ నిబద్ధతను చాటుకుంటామని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసి, వారిని ఆదుకోవాలన్నదే కాంగ్రెస్ సంకల్పమని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను తెగనమ్ముకున్న ఒక సన్నాసి ఆగస్టులోగా రుణమాఫీ చేయాలని సవాల్ విసిరాడని.. తాము జూలైలోనే రూ.లక్ష రుణమాఫీ చేసి 6 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. అధికారం కోల్పోయామన్న బాధ నుంచి తండ్రీకొడుకులు (కేసీఆర్, కేటీఆర్) ఇంకా తేరుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల కంటే ముందు సూదిని జైపాల్‌రెడ్డిని సీఎంగా ప్రకటించి ఉంటే కాంగ్రెసకు అధికారం దక్కేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో సీఎం రేవంత్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెల 31లోగా రూ.లక్షన్నర రుణం నుంచి రైతులకు విముక్తి కల్పించబోతున్నామని ప్రకటించారు. ఆగస్టు 2 నుంచి 14 వరకు తాను విదేశీ పర్యటనలో ఉ ంటానని, వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణాలన్నీ మాఫీ అవుతాయని చెప్పారు. ఆ సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల్లో సూదిని జైపాల్‌రెడ్డి లాంటి మహోన్నత వ్యక్తిత్వాలు చాలా అరుదుగా ఉంటాయని సీఎం చెప్పారు. నిజాయతీ గల నేతగా ..మిగతా 2లో




కోచింగ్ సెంటర్‌లో

## జలసమాధి

### ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి భారీగా వరద నీరు

### మంచిర్యాల జిల్లాకు చెందిన తాన్యా సహా ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతి

### సెల్లార్ లైబ్రరీలో ఉండగా ప్రమాదం..

న్యూఢిల్లీ, జులై 28 (ప్రభాత ఉదయం): సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీకి వెళ్లిన ముగ్గురు అభ్యర్థులు వరదనీటిలో మునిగి మరణించారు. కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటుండగా ఉప్పెనలా ముంచెత్తిన వరద ఓ తెలంగాణ యువతితో పాటు మరో ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లాకు చెందిన తాన్యా సోని(21), ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయ యాదవ్(25), కేరళలోని ఎర్నాకుళంకు చెందిన నవీన్ దల్విన్(29) వరదనీటిలో మునిగి మరణించారు. లైబ్రరీ డోర్‌కు బయోమెట్రిక్ వ్యవస్థ ఉందని, ఇది లాక్ అయిపోవడం వల్లే వీరు బయటకు రాలేకపోయారని పలువురు విద్యార్థులు చెప్తున్నారు.

#### విద్యార్థుల ఆందోళన

ఈ ఘటనకు స్టడీ సర్కిల్ యాజమాన్యంతో పాటు అధికార యంత్రాంగమే కారణమని ఆరోపిస్తున్న వివిధ ..మిగతా 2లో



## గోడమీది పిల్లిలా ఎంఐఎం

### ఎవరు అధికారంలో ఉంటే వారి చెంతకు

### కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, జులై 28 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో ఎంఐఎం గోడమీది పిల్లిలాంటిదని, ఎవరు అధికారంలో ఉంటే వారి చెంతకు చేరుతుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. అధికారం పోగానే వారితో సంబంధాలు తెంపేసుకుంటుందని విమర్శించారు. పాతబస్తి లాల్‌దర్వాజ బోనాల సందర్భంగా చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ అన్నదమ్ములయ్యారన్నారు. అక్బరుద్దీన్‌ను డిప్యూటీ సీఎం చేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నారని చెప్పారు. దమ్ముంటే అక్బరుద్దీన్ కొడంగల్ నుంచి పోటీచేయాలని, డిపాజిట్ కూడా రాకుండా చేస్తామన్నారు. కొన్ని ప్రాంతాల్లో బోనాలను అడ్డుకుంటున్నారని, ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూడాలన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరూ ఆనందంగా ఉండాలని కోరుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రాగానే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని తెలిపారు. తాను హిందువుల తరపున పక్కా మాట్లాడుతానని, అయితే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

## నిరుద్యోగులకు శుభవార్త

### ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి ఉచిత శిక్షణ

### ఆగస్టు 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి పొంగులేటి పిలుపు




హైదరాబాద్, జులై 28 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఉద్యోగుల భర్తీ విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే.. ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే సుమారు 30 వేల ఉద్యోగాల విషయంలో నెలకొన్న అడ్డంకులను పూర్తిగా తొలిగించి అభ్యర్థులను నియామక పత్రాలు అందజేసి.. నిరుద్యోగుల్లో నమ్మకం కల్పించే ప్రయత్నం చేసింది. అయితే.. డీఎసీసీ, గ్రూప్స్ పరీక్షల నోటిఫికేషన్ల విషయంలో నిరుద్యోగుల్లో కొంత ఆందోళన చెలరేగినప్పటికీ.. ప్రభుత్వం వారి సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ప్రతి ఏడాది కచ్చితంగా జాబ్ క్యాలెండర్ వేస్తామని ప్రభుత్వం పదే పదే హామీ ఇవ్వటంతో... నిరుద్యోగులు కూడా నమ్మకం పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే గ్రూప్ 2, 3 నోటిఫికేషన్లు ప్రకటించగా.. వాటి కోసం నిరుద్యోగులు సన్నద్ధమయ్యే పనిలో నిమగ్నమయ్యారు. వీటితో పాటు త్వరలోనే మరో డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వేయనున్నట్టు సమాచారం ఉండటంతో వాటికి కూడా అభ్యర్థులు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుడ్ న్యూస్ వినిపించారు. త్వరలో జరగనున్న గ్రూప్-2, 3 పరీక్షలతో పాటు రాబోయే పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న పాలేరు నియోజకవర్గంలోని ..మిగతా 2లో



భారత రాజకీయాల్లో

## మరో సంచలనం

### ప్రశాంత్ కిషోర్ కొత్త పార్టీ

న్యూఢిల్లీ, జులై 28 (ప్రభాత ఉదయం): ప్రముఖ రాజకీయ వ్యూహ కర్త, ఐ ప్యాక్ ఫౌండర్ ప్రశాంత్ కిషోర్ కొత్త పార్టీ పెట్టబోతున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు. ఆదివారం పాట్నాలో నిర్వహించిన 'జన్ సురాజ్' రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. బిహార్ కేంద్రంగా 'జన్ సురాజ్' పేరుతో ఓ ప్రజా చైతన్య సంస్థ రన్ చేస్తున్నానని పేర్కొన్నారు. అయితే, అదే పేరును తాను కొత్తగా పెట్టబోయే పార్టీకి నామకరణం చేస్తున్నట్లుగా ప్రకటించారు. అక్టోబర్ 2, గాంధీ జయంతి సందర్భంగా 'జన్ సురాజ్' పార్టీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. అయితే, 2025లో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'జన్ సురాజ్' బరిలోకి దిగుతుందని, ఒంటరిగానే జేడీయూ అధినేత సీఎం నితీశ్ కుమార్‌ను ఎదుర్కొంటామని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు.

### రాజేంద్రనగర్ ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయాల్లో

# ఘనంగా బోనాల ఉత్సవాలు



రాజేంద్రనగర్ ఎన్ ఐ ఆర్ డీ చౌరస్తాలో గల ఈదమ్మ, భూ లక్ష్మమ్మ లకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



ఈదమ్మ దేవాలయం వద్ద బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యతిపతి శ్రీధర్, ఎం .నాగభూషణం, వై. హరగోపాల్ లు



ఈదమ్మ దేవాలయం వద్ద భక్తులు

బుద్వేల్, జూలై 28(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ ఎన్ ఐ ఆర్ డీ చౌరస్తా లో ఉన్నటువంటి ఈదమ్మ, భూ లక్ష్మమ్మ దేవాలయాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం నుంచే మహిళా భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించడానికి బారులు తీరారు. రాజేంద్రనగర్ కు చెందిన పలువురు నాయకులు, యువకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు బీజేపీ నాయకుడు వై శ్రీధర్ బోనాల పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



బుద్వేల్ లో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

## బుద్వేల్‌లో ఘనంగా బోనాలు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): బుద్వేల్ లో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుద్వేల్ కామునికంత వద్ద బొడ్రాయి కి, రజక బస్తీలో, గ్రీన్ సిటీ లోని పోచమ్మ తల్లి దేవాలయంలో, కోట గోడను ఆనుకొని ఉన్న కోట మైసమ్మ తల్లికి, దళిత బస్తీలోని పోచమ్మ అమ్మవారికి, టీచర్స్ కాలనీ శ్రీ కట్ట మైసమ్మ తల్లికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. వివిధ వర్గాల ప్రజలు ఈ బోనాల వేడుకలలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా దేవాలయ కమిటీ ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుద్వేల్‌లో పోచమ్మ తల్లికి బోనం సమర్పించడానికి వెళ్తున్న భక్తులు



### కుతుబ్ షాహీ టూంబ్స్‌ను

## సందర్శించిన రేవంత్

హైదరాబాద్, జులై 28 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ లోని కుతుబ్షాహీ హెరిటేజ్ పార్క్లో అగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుతుబ్షాహీ టూంబ్స్ను రేవంత్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి పరిశీలించారు. ఆ ఆవరణలో రేవంత్ రెడ్డి అక్కడ మొక్క నాటారు. 2013లో కుతుబ్షాహీ వారసత్వ సంపద పరిరక్షణ ప్రాజెక్టును అగాఖాన్ ఫౌండేషన్ చేపట్టింది. తెలంగాణ సాంస్కృతిక శాఖతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తాజాగా ఆ కార్యక్రమ ముగింపు నేడు జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రభుత్వం, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో జరుగుతున్న పునరుద్ధరణ ప్రాజెక్ట్ ముగింపు కార్యక్రమంలో మీ అందరితో కలిసి పాల్గొనడం నాకు ఆనందంతో పాటు గౌరవంగా ఉంది. వేల సంవత్సరాల నాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలతో నిండిన తెలంగాణ కు మీలో ప్రతి ఒక్కరికి స్వాగతం. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు మరియు ఇతరులు ఈ ప్రాంతాన్ని పాలించారు. ప్రతి ఒక్కరు వారి ప్రత్యేకమైన సాంస్కృతిక ముద్రను వేశారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్షాహి సమాధులు, పైగా సమాధులు, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, అలంపూర్ దేవాలయాలు వంటివి వాస్తు అద్భుతాలకు తెలంగాణ నిలయంగా ఉంది. శతాబ్దాలుగా హైదరాబాద్ 'గంగా-జమునా తెహజీబ్'గా పిలుస్తూ బహుళ జాతులు, సంస్కృతుల సామరస్యాన్ని, సహజీవనాన్ని చూసింది. కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్ , సెవెన్ టూంబ్స్ ఔట్స్ షాహిన్ రాజవంశం నిర్మాణ నైపుణ్యానికి , సాంస్కృతిక గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తాయి. మన ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడటం తో పాటు ప్రపంచ పటంలో సగర్వంగా ఉంచుతుంది. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ ప్రదేశం రామప్ప దేవాలయానికి తెలంగాణ గర్వకారణం. 2013లో ఎంఓయూతో ప్రారంభించి,100 కంటే ఎక్కువ స్మారక చిహ్నాల పరిరక్షణ తో పాటు 106 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన ఈ కార్యక్రమం అతిపెద్ద పరిరక్షణ ప్రయత్నానికి నిదర్శనం. ఆఘాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సహకారానికి , ఉదారతకు తెలంగాణ ప్రభుత్వం , హైదరాబాద్ ప్రజల తరపున అభినందనలు , కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను ఈ సందర్భంగా హాజరైన విశిష్ట అతిథులందరికీ, ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ కి ధన్యవాదాలు" అని రేవంత్ రెడ్డి అన్నారు.

### తెలంగాణ గవర్నర్‌గా

## జిష్ణుదేవ్‌వర్మ

మొదటి పేజీ తరువాయి...

నియమితులైనట్లు సమాచారం. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా, అస్సాం గవర్నర్‌గా ఉన్న గులాబ్ చంద్ కటారియా పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమితులయ్యారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్న లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య అస్సాం గవర్నర్‌గా నియమితులయ్యారు. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు మణిపూర్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

**తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ..**

తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి అయిన ఆయన.. ప్రస్తుత ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ స్థానంలో రానున్నారు. రాజ కుటుంబానికి చెందిన జిష్ణుదేవ్ 1957 ఆగస్టు 15న జన్మించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. 1990ల ప్రారంభంలో బీజేపీలో చేరారు. అయోధ్య రామ జన్మభూమి ఉద్యమంలో పాల్గొన్నారు. 2018-23 మధ్య ఉప ముఖ్యమంత్రిగా, త్రిపుర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

## నిరుద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి...

గ్రామీణ నిరుద్యోగులకు చేయూత ఇచ్చేందుకు మంత్రి ముందుకొచ్చారు. రాష్ట్రంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న "రైట్ ఛాయిస్ అకాడమీ" సహకారంతో "పొంగులేటి శీనన్న నిరుద్యోగ కానుక" పేరిట ఉచిత కోచింగ్ క్యాంప్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో పొంగులేటి విడుదల చేశారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత.. ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. పాలేరు నియోజవకర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత.. ఆగస్టు 9వ తేదీ లోపు అభ్యర్థి పేరు, గ్రామం, మండలం వివరాలను 8985096699 ఫోన్ నెంబర్‌కు వాట్సప్‌లో పంపాలని నిర్వాహకులు సూచించారు. వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్ తీసుకోలేని గ్రామీణ విద్యార్థుల కోసం మంత్రి పొంగులేటి ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం పట్ల నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కల్వకుర్తికి సీఎం వరాలు

మొదటి పేజీ తరువాయి...

జైపాల్‌రెడ్డి తెలుగుజాతికే వన్నె తెచ్చారన్నారు. రాజకీయ నేతలకు జైపాల్‌రెడ్డి దార్శనికుడని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయనది కీలక పాత్ర అని తెలిపారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును కొన్ని పక్షాలు వ్యతిరేకించిన సందర్భంలో మూడాఫ్ ద హౌస్ ప్రకారం బిల్లు పాసయ్యేలా చేయొచ్చని అప్పటి స్పీకర్ మీరాకుమార్‌ను ఒప్పించారన్నారు. పార్లమెంటు తలుపులు మూసివేసి, టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం నిలిపివేసి, తెలంగాణ బిల్లు పాసయ్యేలా చేయడంలో జైపాల్‌రెడ్డి ప్రమేయం ఎంతో ఉందని చెప్పారు. అనేక ఒడుదొడుకులను ఎదుర్కొని, రాజకీయంగా జరిగే నష్టాల గురించి అంచనాలున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంలో సోనియాగాంధీ చూపిన చొరవ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెసకు 2014 ఎన్నికల్లో అధికారం దక్కకపోవడానికి ఓ తప్పిదమే కారణమన్నారు. ఎన్నికల కంటే ముందే జైపాల్‌రెడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఉంటే రాష్ట్ర రాజకీయాలు మరోలా ఉండేవన్నారు. తెలంగాణకు జైపాల్‌రెడ్డే తొలి ముఖ్యమంత్రి అయ్యేవారని రేవంత్ చెప్పారు. ఆ ఒక్క తప్పిదం వల్లే తెలంగాణ రాష్ట్రాన్ని తెగనమ్ముకునే పరిస్థితి కేసీఆర్ కుటుంబానికి దక్కిందన్నారు. అధికారం కోల్పోయామనే బాధ కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా తగ్గలేదని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ అసెంబ్లీకి రాడు. నేను, నా బావనే అధికార పక్షం అడిగే వాటికి సమాధానం చెబుతామని కేటీఆర్ చెప్పాడు. కానీ, బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు 11 గంటలకే కేసీఆర్ అసెంబ్లీలో ప్రత్యక్షమయ్యారు' అని రేవంత్ అన్నారు. తండ్రీకొడుకుల మధ్యనే సమన్వయం లేదనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మేడిగడ్డను సందర్శించి కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

**నాలుగు వరసల రహదారి..**

హైదరాబాద్-కల్వకుర్తి మధ్య రహదారిని నాలుగు వరసలుగా విస్తరించనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. శ్రీశైలం వెళ్లే భక్తుల రద్దీ పెరిగినందున.. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మూడు లేన్లుగా ఉన్న ఈ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ విషయమై తాను, మంత్రి కోమటి వెంకటరెడ్డి.. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇక కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**కార్యకర్తలను గెలిపించుకుంటాం..**

నాయకుల ఎన్నికలు ముగిశాయని, కార్యకర్తలను గెలిపించుకునే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలను కచ్చితంగా గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. పుట్టిన గడ్డకు తొలిసారి వచ్చిన సీఎం.. కల్వకుర్తిపై వరాల జల్లు కురిపించారు. రూ.10 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంజూరు చేశారు. ఆగస్టు 1 నుంచి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. తాను చదువుకున్న కల్వకుర్తి మండలంలోని తాండ్రా పాఠశాలకు రూ.5 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. విగ్రహావిష్కరణ సభకు హాజరైన మంత్రి దామోదర రాజనరసింహ.. జైపాల్‌రెడ్డితో తమ కుటుంబానికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి లాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు. 2014లో జైపాల్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వాల్సి ఉందని, ఆ లోటును ఇప్పుడు రేవంత్‌రెడ్డి భర్తీ చేశారని చెప్పారు. నల్లమల బిడ్డ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం శుభప్రదమని మరో మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

**వృత్తి నైపుణ్య వర్సిటీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్**

ఇబ్రహీంపట్నం/కందుకూరు: వృత్తి నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్‌పేట వద్ద గుర్తించిన స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ సర్వే నంబరు 112లోని 57 ఎకరాల ప్రభుత్వ భూమిని వర్సిటీ కోసం అధికారులు గుర్తించారు. భూముల పటాన్ని పరిశీలించిన సీఎం, ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న ఈ వర్సిటీకి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వర్సిటీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (కొంగర కలాన్) వరకు 200 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు నిధులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. కాగా ఈ ప్రాంతంలో ఫార్మా, నాన్ ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం సూచించినట్లు తెలిసింది.

**స్ఫూర్తి స్థల్‌లో జైపాల్‌కు సీఎం రేవంత్ నివాళులు**

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నెక్లెసరోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఎంతో పాటు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జైపాల్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.




### కోచింగ్ సెంటర్‌లో

## జలసమాధి

మొదటి పేజీ తరువాయి...

కోచింగ్ సెంటర్లకు చెందిన విద్యార్థులు ఘటన జరిగిన రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ముందు ఆదివారం ఆందోళనకు దిగారు. నగరవ్యాప్తంగా ఉన్న అన్ని కోచింగ్ సెంటర్లలోనూ భద్రతా ఉల్లంఘనలు ఉన్నప్పటికీ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఘటన జరిగిన ప్రాంతంలో వరదనీరు నిలుస్తుండటంపై వారం క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి లక్షల్లో వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్లు కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

**స్టోర్‌రూమ్ పేరుతో లైబ్రరీ నిర్వహణ**

రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లో స్టోర్‌రూమ్, పార్కింగ్‌కు మాత్రమే అనుమతి ఉంది. కానీ అందులో లైబ్రరీ నిర్వహిస్తు న్నారు. స్టడీ సర్కిల్ యాజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించినట్టు ఢిల్లీ మంత్రి ఆతిశీ తెలిపారు.

**తల్లిదండ్రులు రైలులో ఉండగా మరణవార్త**

మృతుల్లో ఒకరైన తాన్యా సోనిది మంచిర్యాల జిల్లా నస్పూర్. వీరి స్వస్థలం బీహార్. తాన్యా తండ్రి విజయ్‌కుమార్.. సీసీసీ నస్పూర్ బంగ్లాస్ ప్రాంతంలో నివాసముంటూ శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఎస్ఆర్‌పీ-1 గని మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. చదువులో చురుగ్గా ఉండే తాన్యాను డిగ్రీ పూర్తయిన వెంటనే సివిల్ సర్వీస్ చదివించడానికి ఢిల్లీకి పంపించారు. కాగా, తాన్యా కుటుంబం ఆమె చెల్లిని లక్నోలోని కళాశాలలో దించడానికి శనివారం సాయంత్రమే బయలుదేరింది. రైలులో నాగ్‌పూర్ వద్ద ఉండగా విజయ్‌కుమార్‌కు కూతురు మరణవార్త తెలిసింది. తాన్యా సోని మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.

## అమ్మవారి సేవలో కార్పొరేటర్లు



రాజేంద్రనగర్ అంబెడ్కర్ నగర్ ను ఆనుకుని ఉన్న శ్రీ మైసమ్మ దేవాలయం లో పూజలు చేస్తున్న రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి. అర్చన జయ ప్రకాష్



శివరాంపల్లి లో కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్ దంపతులను సన్మానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ పి. సరళ జీవన్ దాస్, తదితరులు.



హైదర్ గూడలో బోనమెత్తిన అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్లు ఏం సంగీత గౌరీ శంకర్, పి అర్చన జయప్రకాష్ లు ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలలో అమ్మవారికి పూజలు చేశారు. ప్రజలందరూ చల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించారు. ఆయా డివిజన్లలోని వివిధ బస్తీలలో పర్యటించి, అమ్మవారి దేవాలయాలను దర్శించి పూజలు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# హైదర్‌గూడలో కన్నుల పండువగా బోనాల వేడుకలు


హైదర్‌గూడలో ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో బోనాల వేడుకలలో పాల్గొన్న పుర ప్రముఖులు


హైదర్‌గూడలో పోచమ్మ తల్లికి బోనం సమర్పించడానికి బారులు తీరిన మహిళా భక్తులు


హైదర్ గూడ బాబు జగ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకలలో పాల్గొన్న సంఘ సేవకులు భీష్మ. చిత్రంలో ఎం. బాలసుబ్రమణ్యం

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ బస్తీలో ఆదివారం బోనాల పండుగ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో బోనాల వేడుకలను నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి దేవాలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. హైదర్ గూడ లో జరిగిన బోనాల వేడుకలలో షాద్ నగర్ ఇన్స్పెక్టర్ కె నరసింహ పాల్గొన్నారు. ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నరసింహ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, కొలన్ సుభాష్ రెడ్డి, ఎస్ బి హరినాథ్, ఎస్. జయనంద్ రెడ్డి , ఎన్ మల్లారెడ్డి ఎం కొమురయ్య, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్ తదితరులు పూజ ఏర్పాట్లను, దేవాలయాల వద్ద భక్తులకు సౌకర్యాలను కల్పించారు. హైదర్ గూడ పోచమ్మ దేవాలయం లో శెట్టిగారి నరేందర్ (చిన్న) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.


పోతురాజులను సన్మానిస్తున్న జి. పుల్లారెడ్డి



బోనాల వేడుకలలో పాల్గొన్న షాద్ నగర్ ఇన్స్ పెక్టర్ కె. నర్సింహ

### బాబు జగ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో.....

హైదర్ గూడ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల పండుగ ఉత్సవాలకు ప్రముఖ సంఘ సేవకులు ఘురానాపూల్ భీష్మ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దూరి బాలసుబ్రమణ్యం, కొత్తూరు మల్లేష్, సోమవారం శ్రీనివాస్, ఏం మహేందర్, మద్దూరి శ్రీనివాస్, ఉష్కల శ్రీకాంత్, తోకటి వినోద్ కుమార్, బుర్ర మహేష్, సాయి సంతోష్, భరత్, నిఖిల్, గిరి, రాజు, రక్షణ సందీప్ తదితరులు పాల్గొన్నారు.


తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, మైలార్ దేవ్ పల్లి ఇన్స్ పెక్టర్ నరేందర్, డీఐ తిమ్మప్ప లు


స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ డ్రగ్

## ముంబై నుంచి నగరానికి ఎండిఎంఏ డ్రగ్

### విక్రయిస్తున్న ముఠాలోని నలుగురు సభ్యులు అరెస్ట్
### మరో ఆరుగురు కోసం గాలిస్తున్న పోలీసులు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): ముంబై నుంచి నిషేదిత ఎండిఎం ఏ డ్రగ్ ను తీసుకువచ్చి నగరంలోని వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాలోని నలుగురు సభ్యులను టిఎస్ - న్యాబ్, మైలార్ దేవుపల్లి పోలీసులు శనివారం సంయుక్తంగా దాడులు చేసి అరెస్టు చేశారు. మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి తొమ్మిది లక్షల విలువ చేసే ఎండిఎంఏ డ్రగ్ తో పాటు నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం వివరాలను రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ , మైలార్ దేవ్ పల్లి ఇన్స్ పెక్టర్ నరేందర్, డీఐ తిమ్మప్ప లతో కలిసి వివరించారు. వెస్ట్ ముంబై జోగేశ్వరి కెప్టెన్ సమంత మార్గ్, అగర్వాల్ స్ట్రీట్, ప్రథమేష్ కుటీర్ ప్రాంతానికి చెందిన సల్మాన్ షా (27 ) తో పాటు షాహిద్, వాజిద్, నీతా లు ముఠాగా ఏర్పడి ముంబై నుంచి నిషేధిత ఎండి ఎంఏ డ్రగ్ ను తీసుకువచ్చి నగరంలోని లక్ష్మీగూడ తో పాటు వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్నారు. అందులో భాగంగానే శనివారం సల్మాన్ షా 90 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్ ను తీసుకొని లక్ష్మి గూడ ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉండే జిహెచ్ఎంసిలో బ్రోకర్ గా పనిచేస్తున్న గచ్చిబౌలికి చెందిన మహమ్మద్ అతిక్( 35) దగ్గరకు వచ్చాడు. అప్పటికే అతని కోసం టోలిచౌకి పారమౌంట్ హిల్స్ కోహినూర్ రెసిడెన్సీ నివాసి రిజ్వాన్ అలీ(37) , చార్మినార్ దివాన్ దేవుడి ఇర్ఫాన్ టెక్స్ టైల్స్ సమీపంలో నివాసముండే మహమ్మద్ యాసీన్ (38) లు వేచి చూస్తున్నారు. సల్మాన్ షా డ్రగ్ తీసుకొని రాగానే ముందుగానే పక్క సమాచారంతో కాపు కాసిన టిఎస్ - న్యాబ్ పోలీసులు, మైలార్ దేవ్ పల్లి పోలీసులు సంయుక్తంగా ముఠాపై దాడి చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 9 లక్షల విలువ చేసే 90 గ్రాముల నిషేధిత ఎండిఎంఏ డ్రగ్ ను, 4 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ముంబాయికి చెందిన షాహీద్, వాజీద్, నీతా లతో పాటు హాఫీస్ బాబానగర్ కు చెందిన అబ్రార్, శాలిబండ కు చెందిన నాసర్, హ్యాపీ హోమ్స్ ఫోర్చునా లో నివాసముండే మహమ్మద్ సమీర్ అలియాస్ బాబా ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## 30న సాయంత్రం 5 గంటలకు రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీలో ఫలహారం బండి ఊరేగింపు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ శ్రీ నల్లపోచమ్మ తల్లి, ఈదమ్మ దేవాలయం లకు ఫలహారం బండి ని ఊరేగింపుగా తీసుకువెళ్ళనున్నట్లు నిర్వాహకులు బ్రాహ్మణపల్లి బాల్ రాజ్ ముదిరాజ్, బి. గౌతమ్ ముదిరాజ్ లు ఓ ప్రకటన లో తెలిపారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగ అనంతరం ఫలహారపు బండి ఊరేగింపు తీస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




## తండ్రి కొడుకుల మధ్య జరిగిన తోపులాటలో కింద పడ్డ తండ్రి మృతి

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం) : తండ్రి కొడుకుల మధ్య శనివారం రాత్రి జరిగిన గొడవలో తండ్రి క్రిందపడి మరణించాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి...... మైలాల్ దేవ్ పల్లి ప్రగతి కాలనీ ప్రాంతానికి చెందిన క్రిష్టప్ప (55) నిత్యం మద్యం సేవిస్తూ పని పాట లేకుండా ఉంటున్నాడు. ఈ విషయమై శనివారం రాత్రి ఆయన కుమారుడు నరేందర్ (35) తండ్రిని నిల తీశాడు. దీంతో వారి మధ్య గొడవ ప్రారంభమైంది . ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల వరకు తాగిన మైకంలో గొడవ పడుతూనే ఉన్నారు. ఈ గొడవలో కొడుకు మహేందర్ తండ్రిని తోసి వేయడంతో కింద పడ్డ కిష్టప్ప అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ నరేందర్ లు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వివారాలు సేకరించారు. కిష్టప్ప మృతదేహాన్ని పోస్ట్మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కిష్టప్ప బంధువు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రాంబాగ్ దుర్గా మాత అమ్మ వారికి బోనం సమర్పించడానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమా మహేశ్వరీ రెడ్డి


బోనంతో ఉమా మహేశ్వరీ రెడ్డి

## రాంబాగ్ దుర్గామాత అమ్మవారికి బోనం సమర్పించిన బీజీపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరీ రెడ్డి

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరీ రెడ్డి అన్నారు. బోనాల పండుగ ను పునరస్కరించుకొని ఆదివారం రాంబాగ్ దుర్గామాత అమ్మవారి కి ఆమె మహిళా నాయకులతో కలిసి బోనం సమర్పించారు. ప్రజలందరూ చల్లంగా ఉండాలని, దేశం ప్రపంచ దేశాలలో అభివృద్ధి చెందాలని మొక్కులు చెల్లించుకున్నారు.


హైదర్ గూడలో ఘనంగా బోనాల ఉత్సవాలు

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ సంఘ సేవకులు ఘురానాపూల్ భీష్మ

రాజేంద్రనగర్,జులై 28(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఆదివారం ఆషాడ బోనాలు ఉత్సవాలు కన్నుల పండుగ జరిగాయి. హైదర్ గూడ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీగా తరలివచ్చి అమ్మవారికి బోనం,నైవేద్యం,సాక సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. హుషారెత్తించేగీతాలు..జానపదగేయాలు..డప్పువాయిద్యాలు..పోతరాజుల వీరంగం.. నృత్యాలు చేస్తూ హైదర్ గూడ వాసులు బోనాల పండుగ పర్వదినాన్ని అత్యంతవైభవంగా జరుపుకున్నారు. బోనాల పండుగ ఉత్సవాలకు ప్రముఖ సంఘ సేవకులు ఘురానాపూల్ భీష్మ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు ఘురానాపూల్ భీష్మ మాట్లాడుతూ...బోనాల ఉత్సవాలు గ్రామాల్లో మతసామరస్యానికి చిహ్నాలుగా నిలుస్తాయని చెప్పారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరి బాలసుబ్రమణ్యం, కొత్తూరు మల్లేష్,సోమవారం శ్రీనివాస్,ఏం మహేందర్,మద్దూరి శ్రీనివాస్,ఉష్కల శ్రీకాంత్,తోకటి వినోద్ కుమార్,బుర్ర మహేష్,సాయి సంతోష్, భరత్, నిఖిల్,గిరి,రాజు,రక్షణ సందీప్ తదితరులు పాల్గొన్నారు.


బాబుల్ రెడ్డి నగర్ లో అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ తదితరులు

## ప్రజలందరిని చల్లంగా చూడమ్మా

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం):రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలందరిని చల్లంగా చూడాలని, ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్ అమ్మవారిని వేడుకున్నారు. బాబుల్ రెడ్డి నగర్ బస్తీలో శ్రీ పోచమ్మ తల్లిని మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ తో కలిసి ఆయన దర్శించుకుని పూజలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ బస్తీలు , కాలనీలలో జరిగిన బోనాల పండుగ వేడుకలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని , పంట నష్టం కాకుండా ఉండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

## మధుబన్ కాలనీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్, మైలార్ దేవ్ పల్లి డివిజన్, మధుబన్ కాలనీలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ పోచమ్మ అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు సైతం అమ్మవారికి బోనం సమర్పించారు. సాక్షి దినపత్రిక విలేఖరి గద్దె యాదగిరి కుమార్తె గద్దె మహాలక్ష్మి నెత్తిన బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభాత ఉదయం ప్రతినిధి గద్దె మహాలక్ష్మిని పలకరి ంచగా, అమ్మవారికి బోనం సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు.


మధుబన్ కాలనీలో బోనంతో చిన్నారి గద్దె మహాలక్ష్మి

## ఎర్ర బోడలో ఘనంగా బోనాలు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): హైదర్ గూడ ఎర్ర బోడ లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచే అమ్మ వారి దేవాలయంలో బోనాలు సమర్పించారు.


బోనాల వేడుకలలో ఎర్ర బోడ కాలనీ వాసులు


గాంధీ నగర్ నుంచి హిమాయత్ సాగర్ సౌడమ్మ తల్లికి బోనాలు సమర్పించడానికి వెళ్తున్న మహిళా భక్తులు

## హిమాయత్ సాగర్ సౌడమ్మ తల్లికి బోనాలు సమర్పణ

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం): హిమాయత్‌సాగర్ సమీపంలోని గాంధీనగర్ సౌడమ్మ దేవాల యంలో ఆదివారం బోనాలు, ఒడిబియ్యం, తొట్టెలను సమర్పించారు. గాంధీనగర్ బస్తివాసులు అంగ రంగ వైభవంగా డీజేలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారి దర్శనానికి బోనాలు ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్ కుటుంబ సమేతంగా గాంధీ నగర్ లో ఎల్లమ్మ తల్లికి బోనం, తొట్టెల సమర్పించి మొక్కులు నెరవేర్చుకున్నారు.


సౌడమ్మ తల్లికి బోనం సమర్పించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు డి. సత్యనారాయణ ముదిరాజ్ కుటుంబ సభ్యులు


రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ అమ్మ వారికి తొట్టెల ను ఊరేగింపు గా తీసుకు వెళ్తున్న దేవాలయ కమిటీ ప్రతినిధులు


అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు


రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ తల్లిని శాకాంబరీ అలంకరణ లో ముస్తాబు చేసిన పీర్లగూడెం బ్రదర్స్


శ్రీ పోచమ్మ అమ్మ వారి దేవాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు

## రాజేంద్రనగర్ శ్రీమాతా పోచమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు

బుద్వేల్, జూలై28(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. దేవాలయ కమిటీ సభ్యులు డుంబాల ఉమారెడ్డి, కొమిరె గణేష్, జి రాములు, పి ఈశ్వర్, పీర్లగూడెం జంగయ్య , పి శివరామ్, పి వెంకటస్వామి, ఎం. రాజు, ఎం యాదమ్మ యాదవ్, రమేష్, సతీష్ ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొట్టెల ఊరేగింపు, బోనాల సమర్పణ, పూజా కార్యక్రమాలలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు వందల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు.

## చిలుకూరు గ్రామంలో కన్నుల పండుగల

# ఘనంగా పోచమ్మ బోనాలు





### తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో బోనాల పండుగ ఎంతో ప్రాముఖ్యం

మొయినాబాద్ జులై 28 (ఉదయం): మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు శివసత్తుల పునకాలు, పోతురాజుల విన్యాసాలతో పోచమ్మ ఆలయం హోరెత్తాయి.బోనం అంటే భోజనం అని.. గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని వేడుకుంటూ గ్రామదేవతలకు శాస్త్రోక్త పూజలు చేసుకుని మేళతాళాలు డప్పుచప్పుళ్లతో అమ్మవారికి సమర్పించే బోనం తొట్టెల ఏంతో పవిత్రమని గ్రామ ప్రజల ప్రగాఢ విశ్వాసం మేళ తాళాల మధ్య మహిళలు బోనాలు, సాక తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి.. చిలుకూరు గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సీఐ పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు అదేవిధంగా మాజీ ఉపసర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ నరసింహా గౌడ్ , బిజెపి సీనియర్ నాయకుడు మంచిరేవుల శ్రీరాములు ముదిరాజ్ , జొన్నాడ సత్యనారాయణ ముదిరాజ్, బిజెపి నాయకుడు రాజు ముదిరాజ్, విలేజ్ అధ్యక్షుడు రామ్ చందర్ ముదిరాజ్, జొన్నాడ యాదయ్య ముదిరాజ్,బాలాజీ భక్తుడు పవన్ కుమార్, కాడిగళ్ల భాస్కర్, గ్రామ పెద్దలు, నాయకులు,ఆడ పడుచులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



## ఆషాడ మాస బోనాల మహోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, జూలై28(ప్రభాత ఉదయం) ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేకానంద నగర్, వల్లభాయ్ పటేల్ నగర్, మార్కండేయ నగర్, చిత్తారమ్మ ఆలయం, గాజులరామారం, గాంధీ నగర్, భగత్ సింగ్ నగర్, గణేష్ నగర్, షాపూర్ ప్రెస్ క్లబ్, రంగారెడ్డి నగర్ తదితర కాలనీల్లో నిర్వహించిన బోనాల మహోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మ వారిని దర్శించుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆకాంక్షించారు.




## కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

**దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి**

**ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిని ఉపేక్షించొద్దు**

**డబ్బు సంపాదన నే ద్యేయంగా ప్రజలను ప్రమాదకర మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నారు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.వెంకటస్వామి**

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 28(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లాలో కల్తీకల్లు మాఫియా ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయని ప్రమాదకరమైన మత్తు పదార్థాలకు ప్రజలను బానిసలు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కేవలం డబ్బు సంపాదననే ద్యేయంగా ప్రజలను మత్తుకు బానిసలను చేస్తున్నారని కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిని ఉపేక్షించకుండా అధికారులు వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారి వెనకాల ఎవరున్నా ఎంతటి వారైనా వదిలిపెట్టొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రాజకీయ నాయకుల అండదండలతో కల్తీకల్లు తయారు చేస్తున్నట్లుగా పత్రికల్లో కథనాలు వస్తున్నాయని అధికారులు సమగ్రమైన విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా జిల్లాలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహిస్తున్నా కల్తీ కల్లు తయారు చేయడం మానుకోవడం లేదని నిషేధిత మత్తు పదార్థాలు కలపడం వల్ల ప్రజలు కల్లుకు బానిసలు అవుతున్నారని కల్లు దొరకని సందర్భాలలో వింత చేష్టలు చేస్తూ పిచ్చిగా వ్యవహరిస్తున్నారని గతంలో కరోనా సందర్భంలో కూడా ఇలాంటి అనేక సంఘటనలు జరిగాయని అన్నారు. అధికారులు సమగ్రమైన విచారణ జరిపి కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఎంతటి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నరసింహ, నాయకులు గజేంద్ర, ఆది పాల్గొన్నారు.

## నిరుద్యోగ గిరిజనులను

# కార్పొరేషన్ ద్వారా ఆదుకోండి

**లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఊమ్లా నాయక్**



శంషాబాద్, జూలై 28. (ప్రభాత ఉదయం) ఎస్టి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలను ఎంచుకోవాలని ఆశించిన యువతి యువకులను ప్రభుత్వం ఆదుకోవాలని రంగారెడ్డి జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఊమ్లా నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్టి కార్పొరేషన్ కు గత కొన్ని సంవత్సరాలుగా ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ అటు కేంద్ర ప్రభుత్వం కానీ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యావంతులైన గిరిజన యువతి యువకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా తమ కాళ్లపై తాము నిలబడాలని ఆశించిన యువతి యువకులకు ప్రభుత్వ విధానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావంతులైన ఎస్టీ యువతి యువకులకు స్వయం ఉపాధి పథకాల కోసం చేయూతనిచ్చే కార్పొరేషన్ను ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేకమంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి చేయూతలేదని అన్నారు. ముఖ్యంగా కార్లు. లారీలు.. నడుపుకొని ఉపాధి పొందాలనుకున్నవారికి ఎస్ టి కార్పొరేషన్ నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో ఈ కార్పొరేషన్ ఉన్న ప్రయోజనం లేకుండా మారిందని ఊమ్లా నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై స్వయం ఉపాధి పథకాలను ఎంచుకునే యువతకు నిరాశ మిగులుతున్నదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఎస్టీ కార్పొరేషన్కు తగిన నిధులు విడుదల చేసి యువతి యువకులను ఆదుకోవాలని ఉమ్లా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి యువతను ఆదుకోని పక్షంలో ఆందోళన చేస్తామని ఊమ్లా నాయక్ హెచ్చరించారు.



మార్కండేయ నగర్ లో జరిగిన బోనాలు ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కాలనీ ప్రతినిధులు పి సూర్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు



## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో

# బోనాల పండుగ ఎంతో ప్రాముఖ్యం

**ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థల విద్యార్థులు కళాశాలలో ఘనంగా బోనాల సంబురాలు**

మొయినాబాద్,28(ఉదయం): బోనాల సంబరాలను పురస్కరించుకోని మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామ సమీపంలో గల ఎన్.టి.ఆర్ ట్రస్ట్ విద్యా సంస్థల విద్యార్థినిలు మట్టికుండల్లో నీటి కుండలతో యాపకొమ్మలను ఏర్పాటు చేసుకోని తెలంగాణ సాంప్రదాయానికి బద్ధంగా అద్దం పట్టేలా బోనాల సంబరాలను వైభవంగా నిర్వహించారు. విద్యను అభ్యసించే విద్యార్థులు బోనాలు ఎత్తుకోని అమ్మవారికి యాపకొమ్మలతో నీటిని సమర్పించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల డీన్ రామారావు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయ వండుగలను అందరు కలిసిమెలిసి చేసుకున్నప్పుడే ఆ పండుగలు ఎంతో ప్రాముఖ్యం ఇస్తాయని తెలిపారు సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విద్యార్థులు వివిద ప్రాంతాలకు చెందిన వారు అయినప్పటికీ మట్టి కుండలను, బోనాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఇంటర్, డిగ్రీ విద్యార్థినిలు పాల్గొన్నారు.



## భారత్ మాల రోడ్డు నిర్వాసిత రైతుల

# జిల్లా సదస్సు జయప్రదం చేయండి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 28(ప్రభాత ఉదయం)తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న భారత్ మాల రోడ్డు నిర్వాసిత రైతుల జిల్లా సదస్సు జయప్రదం చేయాలని నిర్వాసిత రైతులు అంపేష్, అనంత రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి తెలిపారు. ఆదివారం గద్వాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో భారత్ మాల ఆరు వరసల రహదారిలో భూములు కోల్పోయిన రైతుల పట్ల ప్రభుత్వము, జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రెండు సంవత్సరాలు అయినా సమస్య పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. నిర్వాసిత రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వెంటనే ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి రెండవ విడతలో ఇచ్చినట్లుగా రైతులందరికీ నష్టపరిహారం పెంచి ఇవ్వాలని, భారత్ మాల రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని, బావులు, బోర్లు, పైపులైన్లు, చెట్లు నష్టపోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30న గద్వాలలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించు ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మరియు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి హాజరవుతారని జిల్లాలోని భారత్ మాల రోడ్డు నిర్వాసిత రైతులందరూ హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో నిర్వాసిత రైతులు పాల నరసింహులు మరియు పూజారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 28(ప్రభాత ఉదయం)ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వస్తున్న నీటి ఉధృతితో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది దీంతో అధికారులు 41 స్పిల్ వే గేట్లు ఎత్తివేసి నీటిని దిగువనకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 అడుగులకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.670 అడుగులకు చేరింది పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుత నీటి నిలువ 7.971 టీఎంసీలుగా నమోదయింది. జూరాలకు ఇన్ ఫ్లో 3,00,000 క్యూసెక్కులుగా ఉండగా దిగువకు శ్రీశైలం వైపు 2,98,886 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన నెట్టెంపాడు, బీమా ఎత్తిపోతల పథకాలతో పాటు ఎడమ కాలువకు సాగు నీటిని యధావిధిగా విడుదల చేస్తున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్ళు పర్యాటకులను కనువిందు చేస్తోంది. జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో పర్యాటకులతో రద్దీగా మారింది. పోలీసులు డ్యాం పై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అదేవిధంగా సందర్శకులను నీటిలో దిగకుండా ముందు జాగ్రత్తగా హెచ్చరికలు జారీచేస్తున్నారు.



## భక్తులతో కిటకిటలాడిన

# రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం

శంషాబాద్,జూలై 28( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని ఝాన్సీమియాగూడ గ్రామంలో వెలిసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆదివారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనాలు నైవేద్యం సమర్పించారు. పలువురు భక్తులు గొర్రె పొట్టేలు మేకపోతులు కోడిపుంజులను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పూజారులు మల్లికార్జున్. పగడాల శ్రీశైలం. ఆలయ జూనియర్ అసిస్టెంట్ మహిపాల్ యాదవ్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి దేవాలయం వద్ద ప్రత్యేకంగా బోనాలు సమర్పించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



## బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజ్ గిరి,జూలై28(ప్రభాత ఉదయం) మల్కాజ్గిరి నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆదివారంబోనాల పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మమత రెడ్డి దంపతులు ఉజ్జయిని మహంకాళి అమ్మవారితో సహా నల్ల పోచమ్మ ఆలయం పటేల్ నగర్, పోచమ్మ ఆలయం దుర్గా నగర్, పోచమ్మ ఆలయం బిజెఆర్ నగర్ తదితర ఆలయాలను సందర్శించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందని, పండుగను అందరూ ఉత్సాహంగా జరుపుకుంటున్నారని, ప్రజలందరినీ అమ్మవారు ఆరోగ్యంగా చూడాలని, మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ సీనియర్ నాయకులు జి.కే హనుమంత రావు, మేకల రాము యాదవ్ మురుగేశ్, మధుసూదన్ రెడ్డి, భాగ్యానంద్ రావు, వంశీ తదితరులున్నారు.

## ఘనంగా లాల్ దర్వాజా బోనాలు



చార్మినార్,జూలై 28 (ప్రభాత ఉదయం):హైదరాబాద్‌లో లాల్ దర్వాజా బోనాలు ఘనంగా జరుగుతున్నాయి.అమ్మవారి కోసం ప్రత్యేక ఘట్టం ఏర్పాటు చేశారు.తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులను చెల్లించుకుంటున్నారు. మహంకాళి అమ్మవారికి బోనాలను భక్తులు సమర్పిస్తున్నారు.లాల్ దర్వాజా ఆలయం దగ్గర ఐదు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు.బోనాలు తెచ్చే మహిళలకు 2 ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు.నేడు అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నారు.23 ప్రధాన ఆలయాల్లో బోనాల జాతర ఘనంగా కొనసాగుతోంది.రేపు రంగం,అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు.బోనాల సందర్భంగా పలు ఆలయాల్లో భక్తుల కోసం అన్నదానలకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయాలన్నింటిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.